ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
శనివారం, 22 మార్చి 2025


సత్తుపల్లిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

టెన్త్ పరీక్షలు షురూ


- తొలిరోజు ప్రశాంతంగా నిర్వహణ
- పకడ్బందీ ఏర్పాట్లు
- ఖమ్మంలో 26 మంది, భద్రాద్రిలో 34 మంది గైర్హాజరు
- పర్యవేక్షించిన కలెక్టర్, డీఈవోలు
- మాల్ ప్రాక్టీస్ కేసులు నిల్

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా పరిధిలో మొత్తం 97 పరీక్ష కేంద్రాలలో రెగ్యులర్ 16,417 మంది విద్యార్థులకు గాను 16,391 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 26 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు 21 మందికి 17 మంది హాజరుకాగా, నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో 12,269 మంది విద్యార్థులకు గాను 12,235 మంది విద్యార్థులు హాజరయ్యారని, 34మంది గైర్హాజర్ అయ్యారని డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉదయం 8 గంటల నుంచే కేంద్రాలకు చేరుకోవటంతో సందడి కనిపించింది. ఉదయం 9 గంటల నుంచి విద్యార్థులను క్షుణ్నంగా పరిశీలించిన అనంతరమే పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను, వాచీలను, వాటర్ బాటిల్స్‌ను అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించారు.

ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ నగరంలోని నయాబజార్, శ్రీచైతన్య, టేకులపల్లి గురుకులం, పాండురంగాపురం, బల్లేపల్లి , కోయచెలక ప్రభుత్వ పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 38 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్ అందించటంతో పరీక్ష రాసేందుకు కొంత సమయం ఆదా అయినట్లు విద్యార్థులు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు మంచినీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జీరాక్స్, ఇంటర్‌నెట్ షాపులను బంద్ చేయించారు.

భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 73 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 29కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయి. పాల్వంచలోని కేటీపీఎస్, అభ్యుదయ బాలికలు, డీఏవీ, రెజీనా కార్మెలీ కాన్వెంట్, ఆశ్రమపాఠశాల, నవభారత్ సోషల్ వేల్ఫేర్, రేగళ్ల కేంద్రాలను డీఈవో వెంకటేశ్వరచారి, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు పరిశీలించారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కొత్తగూడెం లిటిల్‌బర్డ్స్, పాల్వంచలోని కేటీపీఎస్ జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను, ఇన్విజిలేటర్లు, కేంద్రం తీరుతెన్నులను క్షుణ్నంగా పరిశీలించి వసతులపై ఆరా తీశారు. కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాసే బెంచీలను, కేంద్రాల్లో వసతులనుపరిశీలించి నిర్వాహకులకుపలు సూచనలు చేశారు.

భద్రాద్రిలో సీతారాముల కల్యాణం వీక్షించి తరించాలని అందరూ భావిస్తుంటారు. అయితే స్వామి వారి కల్యాణంలోని తలంబ్రాల ఘట్టం ఎంతో కీలకం. గోటితో ఒలిచిన కోటి తలంబ్రాల కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో తొలుత 2011 శ్రీరామనవమి సమయంలో శ్రీకారం చుట్టారు. నాటి నుంచి ఈ కార్యక్రమం ప్రతి ఏడాది కొనసాగుతోంది. ఈ సారి 14వవిడతగా గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను ఏప్రిల్ ఒకటో తేదీన భద్రాచలంకు రానుండగా రెండున భద్రాద్రి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం వైదిక బృందానికి వాటిని అందజేయనున్నారు.


అమెరికాలో తలంబ్రాల బియ్యం వద్ద రామ నామం జపిస్తున్న దృశ్యం(ఫైల్)

- గోటి తలంబ్రాలకు పెరుగుతున్న ప్రాచుర్యం
- 2011లో కోరుకొండ భక్త బృందంతో శ్రీకారం
- ఐదు రాష్ట్రాలతో పాటు అమెరికా నుంచి ఏటా వస్తున్న గోటి తలంబ్రాలు
- విదేశాల్లో శ్రీరామ నామం జపిస్తున్న భక్తులు
- ఏప్రిల్ ఒకటిన గోటి తలంబ్రాల సమర్పణకు భద్రాద్రి రానున్న కోరుకొండ భక్త బృందం

ఖండాంతరాలు దాటి..

భద్రాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాల కార్యక్రమం ప్రారంభమైంది. ఈసారి సమర్పించే గోటి తలంబ్రాలతో ఇప్పటి వరకు 14 కోట్లకు పైగా గోటితో ఒలిచిన తలంబ్రాలను రామయ్య కల్యాణంకు సమర్పించనున్నారు. ఇదిలా ఉండగా తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో సర్వే నెం.16/2లో ఒక ఎకరం భూమిలో పండించే వడ్లను కేవలం సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసమే వినియోగిస్తున్నారు. ఇందుకోసం ఆ భూమిని ప ప్రత్యేకంగా కేటాయించారు. అంగదుడు, జాంబవంతుడు, సుగ్రీవుడు, ఆంజనేయుడు ప్రత్యేక వేషధారణలతో కోత కోసే సమయంలో భక్తులు పాల్గొంటుంటారు.

ఖండాంతరాలు దాటి

హైదరాబాద్‌కు చెందిన అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మల్లాది వెంకటసుబ్రమణ్య శాస్త్రి-నాగవీణ దంపతులు శ్రీ సీతారామచంద్రస్వామికి కల్యాణ


వైదిక సిబ్బందికి గోటి తలంబ్రాలు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)


బియ్యపు గింజలపై శ్రీరామనామం రాసిన దృశ్యం(ఫైల్)

తలంబ్రాలు సమర్పించేందుకు శ్రీరామనామంతో జపించి సిద్ధం చేసి గతంలో సమర్పించారు. అమెరికాలోని ఓహియో రాష్ట్రంలోని కొలంబస్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ ప్రాంతంలో నివాసముండే రామభక్తులు రెండు లక్షల శ్రీరామనామ జపం చేసిన తలంబ్రాలు గోటి తలంబ్రాలతో కలిపి భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణానికి సమర్పించారు. దేశవిదేశాల్లో శ్రీరామతత్వం ప్రచారం చేయడం తమ ప్రధాన సంకల్పమని కల్యాణం అప్పారావు పేర్కొన్నారు. వీటికి ఉడత భక్తి తలంబ్రాలు అని నామకరణం చేశారు. ధాన్యం అమెరికాకు పంపడానికి సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నందున కోటి తలంబ్రాల కోసం పండించిన పంటలోని ధాన్యం ఇక్కడ గోటితో శ్రీరామనామంతో ఒలిపించి వాటిని అమెరికా పంపించి అక్కడ బియ్యం శ్రీరామనామంతో తలంబ్రాల బియ్యం గింజలపై శ్రీరామనామం రాయించి శ్రీ సీతారాముల కల్యాణ సమయంలో గతంలో అందజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందని భక్తులు సైతం గోటి తలంబ్రాల కార్యక్రమంలో ఉడతాభక్తిగా సమర్పిస్తున్నారు. బియ్యం గింజలపై శ్రీరామ నామాలు రాసి హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన చలువాది మల్లి విష్ణువందన భద్రాద్రి దేవస్థానంలో సమర్పించారు.

శ్రీరామనవమి ముఖ్య ఉత్సవ అధికారిగా కృష్ణవేణి



భద్రాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి ముఖ్య ఉత్సవ అధికారిగా దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఎంఎండీ కృష్ణవేణిని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీరామనవమి ముఖ్య ఉత్సవ అధికారిగా రీజినల్ జాయింట్ కమిషనర్ హోదా గల అధికారులను నియమించేవారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ స్థాయి అధికారిని సీఎఫ్‌వోగా నియమిస్తున్నారు. ఈ క్రమంలో కృష్ణవేణిని సీఎఫ్‌వోగా నియమించినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా కృష్ణవేణి గతంలో 2018 జూలై 2 నుంచి ఏడు వరకు భద్రాచలం దేవస్థానం ఈవోగా స్వల్ప కాలం పాటు విధులు నిర్వహించారు.


తల్లి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరవుతున్న హర్షిణి

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో నవ వధువు తల్లి మృతి, తండ్రికి గాయాలు
- ఆలయానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

సత్తుపల్లి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కుమార్తెకు వివాహమై వారం గడవక ముందే తల్లి మృతి చెందింది. దీంతో ఆ పెళ్లింట విషాదం నెలకొంది. ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన సత్తుపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డుకు చెందిన అడపా రాజేంద్రప్రసాద్, పుష్పావతి దంపతుల ఏకైక కుమార్తె హర్షిణి వివాహం గత శనివారం ఘనంగా జరిపించారు. కాగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సమీపంలోని (మిగతా 6వ పేజీలో)

తేజ మిర్చి ధర మరింత పతనం


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

- నెల రోజుల్లో క్వింటాలుకు రూ. 2 వేలు డౌన్
- మార్కెట్లో గిట్టుబాటు కాక కోల్డ్‌స్టోరేజీలో నిల్వకే మొగ్గు
- ఆందోళనలో మిర్చి రైతులు

ఖమ్మం మార్కెట్/ బోనకల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం మిర్చి ధరలు రోజు రోజుకూ పడిపోతున్నాయి. మార్కెట్‌లో శుక్రవారం క్వింటాలు మిర్చిని రూ.13,450 జెండాపాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ.5,800 నుంచి రూ.11,500 వరకు ఎక్కువ లాట్లను కొనుగోలు చేశారు. మార్కెట్‌లో గత రెండు, మూడు నెలల క్రితం సీజన్ ప్రారంభంలో క్వింటాలు రూ. 19వేల వరకు స్థిరంగా పలికిన మిర్చి ధరలు ఆ తరువాత రోజు రోజుకూ తగ్గుతూ వచ్చాయి.

గత నెల రోజుల క్రితం క్వింటాలు రూ. 15వేలు పలుకగా ప్రస్తుతం క్వింటాలుకు రూ.2వేలకు పైగా తగ్గి క్వింటాలు రూ. 13వేలకు కొనుగోలు చేస్తున్నారు. తేజా రకం మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఈ ఏడాది డిమాండ్ అంతగా లేక ఎగుమతులు నిలిచిపోవడంతోనే ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా మార్కెట్‌కు శుక్రవారం సుమారు 65 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. మార్కెట్లో రోజు రోజుకూ తగ్గుతున్న మిర్చి ధరలతో విసిగి వేసారిన రైతులు కోల్డ్ స్టోరేజీలపై కొండంత ఆశ పెట్టుకున్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాలు రూ. 18వేల నుంచి రూ. 19వేల ధర పలుకుతున్నపుడు వడివడిగా పంట అమ్ముకున్న రైతులు ప్రస్తుతం ధర తగ్గుతున్న కారణంగా గిట్టుబాటు కావడం లేదని పంట నిల్వ కోసం శీతల గిడ్డంగుల వైపు పరిగెడుతున్నారు. రాబో యో రోజుల్లో అయినా పంటకు రేటు పెరగుతుందని ఆశలు పెట్టుకుంటున్నా రు.

ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో రేటుదక్కదని వ్యాపార నిపుణపులు చెబుతున్నా వారిలో ఉన్న కొంత ఆశతో కోల్డ్‌స్టోరేజీలలో పంటను నిల్వ చేస్తున్నారు. ఖమ్మం పరిసరాల్లో పండించే మిర్చికి డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. పంటలో వైరస్, తెగుళ్ల ప్రభావంతో మిర్చిలో నాణ్యత తగ్గడంతో పాటు మిర్చిలో ఆయిల్ రావడం తగ్గి కొంత అంతర్జాతీయంగా డిమాండ్ సన్నగిల్లిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రైతుల విలవిల...


కల్లాల్లో ఉన్న మిరప కాయ

ధరాఘాతంతో మిరప రైతులు విలవిలలాడుతున్నారు. బోనకల్ మండలంలో 5వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఎకరానికి రూ.లక్షకు పైగా ఖర్చు వచ్చిందని, కోతలకూ భారీగానే ఖర్చు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప మార్కెట్లో క్వింటా ధర రూ. 13,500 ఉండగా ఎక్కువగా 11 వేల నుంచి 12 వేల ధర పడుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిన రైతులు ఎక్కువగా ఉన్నారని పండించిన పంటను తక్కువ ధరకు అమ్మలేక, ఉంచుకోలేక నానా అవస్థలు పడుతున్నారు.


ప్రైవేటు ఆస్పత్రిలో లిఫ్ట్ ప్రమాదంలో మృతిచెందిన సరోజిని

ప్రాణం తీసిన లిఫ్ట్

- ప్రైవేటు ఆస్పత్రిలో స్ట్రెచర్‌పైనే ప్రాణాలు విడిచిన మహిళ
- రెండో ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు దూసుకెళ్లిన వైనం
- సెన్సర్లు పని చేయకపోవడమే కారణమని అనుమానం
- ఖమ్మం నగరంలో విషాదం.. ఆందోళనకు దిగిన బంధువులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ లిఫ్ట్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో ఉన్న ప్రసూన ఆస్పత్రిలో ఈ ఘోరం సంభవించింది. వివరాలు ఇలా వున్నాయి... ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన నట్టు సరోజిని(63)కి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు గురువారం ఆమెను ప్రసూన ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ఆమెను పరీక్షించి యాంజియోగ్రామ్ నిర్వహించి ఇంటికి పంపించారు. తిరిగి శుక్రవారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన సరోజినికి వైద్యులు పరీక్షలు నిర్వహించి స్టంట్ వేయాలని చెప్పారు. కుటుంబసభ్యులు అంగీకరించడంతో విజయవంతంగా స్టంట్ వేశారు.

ఆపరేషన్ అనంతరం ఆమెను థియేటర్ ఉన్న రెండో అంతస్థు నుంచి ఐసీయూ వార్డుకి (నాలుగో అంతస్థుకి) తరలించేందుకు స్ట్రెచర్‌పై లిఫ్ట్‌లోకి తీసుకువచ్చారు. ఆమె వెంట ఇద్దరు (మిగతా 6వ పేజీలో)

ఎన్టీఆర్ కాలువ.. ఓ ఐడియా..!


ఎన్టీఆర్ కాలువ

- సీతారామ డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6లో కాలువల తవ్వకం వృథా ప్రయాస
- గోదావరి జలాలను నేరుగా ఎన్టీఆర్ కాలువలో కలపటం ఉత్తమం
- ఇలా చేస్తే ప్రభుత్వానికి రూ.208.30 కోట్ల ఆదా
- అధికారులకు సత్తుపల్లి, వేంసూరు మండలాల రైతుల వినతి

సత్తుపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎల్ఐపీ) నిర్మాణంలో భాగంగా సత్తుపల్లి ట్రంక్ పరిధిలో సత్తుపల్లి, వేంసూరు మండలాలకు గోదావరి జలాలను అందించేందుకు నిర్దేశించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల తవ్వకాలను కొత్తగా చేపట్టకుండా ఎన్టీఆర్ కాలువలో కలపాలని రైతులు కోరుతున్నారు. దీని వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం తప్పుతుందని, తమకు కూడా మేలు జరుగుతుందని రైతులు చెపుతున్నారు.

డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజి-6

సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో సత్తుపల్లి, వేంసూరు మండలాలకు సాగు నీరందించేందుకు గాను డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6లో కాలువల తవ్వకానికి ప్రతిపాదించారు. మెయిన్ కెనాల్ నుంచి 35 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, 78 మైనర్, 19 సబ్ మైనర్ కెనాల్స్ తవ్వకాల కోసం పెద్ద మొత్తంలో భూసేకరణ చేయాల్సి ఉంటుంది. కొత్త స్ట్రక్చర్లను నిర్మించాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు అంచనాలు రూపొందించారు. డిస్ట్రిబ్యూటరీలు కోసం 758 ఎకరాల భూ సేకరణ అవసరం ఉంది. దీనికి గాను రూ.189.50కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అంచనా. డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి మట్టిపని కొత్త నిర్మాణాలు, లైనింగ్ తదితర పనులకు గాను రూ.170.57కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. మొత్తం ప్యాకేజి -6 డిస్ట్రిబ్యూటరీల కోసం రూ.360.07 ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు.

ఎన్టీఆర్ కాలువ

డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజి-6లో భాగంగా గోదావరి నీటిని ఎన్టీఆర్ కాలువ ద్వారా మళ్లించాలని రైతులు కోరుతున్నారు. బేతుపల్లి మిగుల జలాలను వేంసూరు మండలానికి ఎన్టీఆర్ కాలువ ద్వారా గత కొద్ది సంవత్సరాలుగా తరలిస్తున్నారు. ఈ కాలువ ద్వారా సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని చెరువులను నింపుతున్నారు. ఈ రెండు మండలాల్లో గ్రీన్‌ఫీల్డు హైవే, ఎన్టీఆర్ కెనాల్ కోసం గతంలో భూములు ఇచ్చామని, మళ్లీ ప్యాకేజి-6కోసం భూసేకరణ చేస్తే 758 ఎకరాల భూములు కోల్పోతామని రైతులు చెపుతున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ (మిగతా 6వ పేజీలో)

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే రాగమయి

రైతుల విన్నపాలు, సూచనలకు మంత్రి, ఎమ్మెల్యే కూడా మద్దతు పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా రైతుల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఇదే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. రైతులు కోరిన విధంగా డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6ను ఎన్టీఆర్ కాలువలో కలిపితే రైతుల భూములు కోల్పోయే అవకాశం లేదని, కూడా నిధులు ఆదా అయ్యే అవకాశం ఉందని చెపుతూ ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులు వేచి చూస్తున్నారు.



ఖమ్మంలో మాట్లాడుతున్న ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

కోల్పోయిన అధికారాలను పునరుద్ధరించుకున్నాం

- తహసీల్దార్లు, ఆర్డీవోలు, జేసీలకు అధికారాలు
- వీఆర్వోలను మాత్ర సంస్థలోకి తీసుకోవడం విజయం
- తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి 6

ఫటాఫట్



'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది

అజ్మీరా సరిరాం, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

ప్రశ్న: ప్రయాణికులను వేసవిలో ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

జ: రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో చల్లని తాగునీరు ఏర్పాటుచేశాం. కొన్ని బస్టాండ్‌లలో దాతల సహకారంతో మజ్జిగ అందిస్తున్నాం.

ప్ర: మొత్తం ఏసీ బస్సులు ఎన్ని, వాటిలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

జ: రీజియన్ పరిధిలో మొత్తం ఏసీ బస్సులు 40 ఉన్నాయి. కొత్త బస్సులు కావటంతో సౌకర్యాలకు ఎటువంటి ఇబ్బందులు లేవు.

ప్ర: మహాలక్ష్మి పథకంతో ఆదాయం ఎంత?

జ: రీజియన్ పరిధిలో మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి నేటి వరకు 5.81 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా రూ.279 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండ చేశాం.

ప్ర: బస్సుల బ్రేక్‌డౌన్‌కు కారణం?

జ: బస్సుల బ్రేక్‌డౌన్ విషయం నాదృష్టికి రాలేదు. ఎక్కడైన బస్సు బ్రేక్‌డౌన్ అయితే వెంటనే ప్రయాణికులను మరో బస్సు ఏర్పాటు చేసి గమ్యస్థానానికి చేరుస్తాం. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని పాతయి ఉన్నాయి. వాటి స్థానాల్లో కొత్త బస్సులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. మహిళలకు ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం బస్సులు కేటాయించింది. మహిళా స్వయం సంఘాల పల్లెవెలుగు బస్సులను అద్దెరూపంలో తీసుకున్నాం.

ప్ర: రీజియన్ లాభాల్లో ఉందా ? నష్టాల్లో ఉందా ?

జ: రీజియన్ 2023-24, 2024-25 నుంచి లాభాల్లో ఉంది. రూ. 50కోట్ల లాభాల్లో ఉంది.

ప్ర: బస్టాండుల ముందు ప్రైవేటు వాహనాలను నియంత్రిస్తున్నారా?

జ: ప్రయాణికులు ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు వెళ్లేందుకు ప్రస్తుతం 40 నాన్‌స్టాప్ బస్సులను ఏర్పాటు చేశాం. గతంలో ఈ బస్సులు లేని కారణంగా కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించేవారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రైవేటు వాహనాలు బస్టాండ్ ఆవరణలోకి వస్తే సీజ్ చేసి పెనాల్టీలు వేస్తాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురంహవేలి

షే'డెడ్' నెట్లు...!



మొక్కల పెంపకం పందిరిపై చిరిగిన షేడ్‌నెట్

- చిరుగుల పరదాలతో ఎండుతున్న మొక్కలు
- ఊట్లపల్లి పంచాయతీలో అధికారుల నిర్లక్ష్యం

అశ్వారావుపేట రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ ద్వారా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఏటా వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. నర్సరీలో మొక్కలు ఆరోగ్యవంతంగా ఉండేలా మొక్కలపై ప్రత్యేకంగా షేడ్ నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే మండలంలోని ఊట్లపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీ వద్ద మొక్కల కోసం షేడ్ నెట్ పూర్తిగా చిరిగిపోయింది. మండుతున్న ఎండలు మొక్కలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. పంచాయతీ ద్వారా కొత్త షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పంచాయతీ అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టటం లేదు. వేల మొక్కలను పెంచుతున్న అధికారులు కొద్దిపాటి ఖర్చు చేసి నీడను ఏర్పాటు చేయకపోవటం దారుణమని పంచాయతీ వాసులు ఆవేదన చెందుతున్నారు. మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు మాట్లాడుతూ షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేయమని పలుమార్లు పంచాయతీ అధికారులు చెప్పామని, త్వరలోనే ఏర్పాటుకు చేయిస్తామని తెలిపారు.

లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ ఏతేకాఫ్



ఏతేకాఫ్ దీక్ష పాటిస్తున్న యువకులు

కల్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని జామేమసీద్‌లో ముస్లిం భక్తులు శుక్రవారం నుంచి లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ 'ఏతేకాఫ్' దీక్ష ప్రారంభించారు. ప్రవక్త బాటలో రంజాన్ మాసంలో ముస్లింలు మసీద్‌లలో ఏతేకాఫ్ దీక్షను సాగించటం ఆనవాయితి. దీక్ష చేపట్టిన రోజాదారులు పది రోజుల పాటుగా విధిగా ఖుర్‌ఆన్ గ్రంథం పఠనం చేస్తూ, అల్లాహ్ ప్రార్థనలో గడుపుతారు.

స్వయం ఉపాధికి.. ఊపిరి



రాజీవ్ యువ వికాస పథకం

- దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 4
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాలు
- మూడు కేటగిరీల్లో రాయితీలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకంలో యువతకు అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 6 నుంచి మే 30 వరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. జూన్ 2న లబ్ధిదారులకు రుణాల మంజూరు పత్రాలు అందిస్తారు. మీసేవా కేంద్రాల్లో tgobmms.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను స్కాన్ చేసి అందుబాటులో ఉంచుకుంటే మీ ఇంట్లో నుంచే ఈ దరఖాస్తు చేసుకునేందుకు సులువుగా ఉంటుంది. రేషన్ కార్డులోని సభ్యుల్లో ఒకరికి మాత్రమే రుణాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది.

ఏయే యూనిట్లకు అంటే...?

వ్యవసాయంలో ఎడ్ల బండ్లు, ఆయిల్ ఇంజిన్, పంపుసెట్, ఎయిర్ కంప్రెషర్, పత్తి సేకరణయంత్రం, వేరుసెనగ యంత్రం, వర్మీ కంపోస్టు, ఆయిల్‌పామ్ పంటలకు, పశు పోషణలో గేదెలు, ఆవులు, డైరీ ఫామ్, కోడిగుడ్ల వ్యాపారం, చేపల వ్యాపారం, మేకల పెంపకం, పాల వ్యాపారం, పౌల్ట్రీ ఫారం, గొర్రెల పెంపకం, సొంత వ్యాపారం,ఎయిర్ కూలర్ల వ్యాపారం, ఆటోమొబైల్ షాపు, బేకరీ షాపు, హెయిర్ కటింగ్ షాపు, బ్యూటీపార్లర్ షాపు, ఇటుకలు తయారీ వ్యాపారం, వడ్రంగి షాపు, సీసీ కెమెరాల రిపేర్ షాప్, ఫొటో అండ్ వీడియో షాపు ఇలా స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు వాటికి రుణాలు ఇవ్వనున్నారు.



రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన పోర్టల్

రుణం అందే రాయితీ ఇలా..

ఈ పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు రుణాన్ని మూడు కేటగిరీల్లో అందించనున్నారు. అది వారు ఎంచుకున్న యూనిట్‌ను బట్టి రుణం వచ్చిన దాన్ని బట్టి రాయితీని అమలు చేయనున్నారు. కేటగిరి-1 కింద లక్ష రుణానికి 80 శాతం రాయితీ, కేటగిరి-2 కింద రూ.2లక్షల రుణానికి 70 శాతం, కేటగిరి-3 కింద రూ.3లక్షల రుణానికి 60 శాతం రాయితీ ఇవ్వనున్నారు. దీనికిగాను ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, దరఖాస్తుదారుడి కలర్ ఫొటో కావాలి.

కన్న తండ్రి కన్నుమూసినా.. పరీక్షకు హాజరైన అక్కాచెల్లెళ్లు

- ఇల్లెందు మండలం రొంపేడులో విద్యార్థినులకు జీవిత 'పరీక్ష'



రొంపేడులో తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న అక్కాచెల్లెళ్లు హర్షిత, ప్రియా



దనియాలపాడులో పరీక్షకు హాజరై అలేఖ్య

ఇల్లెందురూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రి కన్నుమూసిన సమాచారం తెలిసి కన్నీటి పర్యంతం అవుతూనే ఇద్దరు విద్యార్థినులు పదో తరగతి పరీక్షకు హాజరయ్యారు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం రొంపేడు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇల్లెందు మండలం తిలక్‌నగర్ గ్రామపంచాయతీ కల్తీ రామయ్యగుంపునకు చెందిన కరపాటి వీరస్వామి(40) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందాడు. వీరాస్వామికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా కుమార్తెలు హర్షిత, ప్రియా ఇద్దరు రొంపేడు గిరిజన బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాగా.. పరీక్షకు వెళ్లే ముందు తండ్రి మరణ వార్త వారికి తెలిసింది. దీంతో తల్లడిల్లిపోయారు. ఒక్కవైపు తండ్రి మరణం, మరోవైపు పరీక్షలు ఆ బాలికలను శోకసంద్రంలో నింపాయి. ఉపాధ్యాయుల, బంధువుల సూచనలతో పుట్టెడు దుఃఖంతో అక్కాచెళ్లెల్లు హర్షిత, ప్రియ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాసిన అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

దనియాలపాడులోను..

ఇల్లెందు మండలం దనియాలపాడు గ్రామపంచాయతీ సేవ్యాతండాలో తండ్రి మరణించిర రెండు రోజులకే ఒక విద్యార్థిని పదో తరగతి పరీక్షకు హాజరైంది. దనియాలపాడుకు చెందిన మూతి అలేఖ్య అనే పదో తరగతి విద్యార్థిని తండ్రి వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. పుట్టెడు దుఃఖంలో ఆమె పరీక్షకు హాజరైంది.

ఎన్టీఆర్ కాలువ.. ఓ ఐడియా!

(5వ పేజీ తరువాయి)

కాలువ ద్వారా సాగు నీరు సంమృద్ధిగా వానాకాలం సీజన్‌లో తమ చెరువులకు అందుతోందని గుర్తు చేస్తున్నారు. ఎన్టీఆర్ కాలువను వెయ్యి క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వారని అంటున్నారు. డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6 కోసం కొత్తగా కాలువలు తవ్వకుండా ఎన్టీఆర్ కాలువలోకి మళ్లిస్తే భూసేకరణ ఖర్చు రూ.189.50కోట్లు ప్రభుత్వానికి మిగులుతాయని రైతులు చెపుతున్నారు. అదీ కాక కొత్తగా డిస్ట్రిబ్యూటరీ కాలువల తవ్వకం, లైనింగ్, కొత్త స్ట్రక్చర్ల కోసం చేసే ఖర్చుతో ఎన్టీఆర్ కెనాల్ 28 కిలోమీటర్ల పొడవునా లైనింగ్‌తో పాటు పాత స్ట్రక్చర్ల మరమ్మతులతో పాటు, కొత్తవి నిర్మిస్తే ఉపయోగం ఉంటుందని చెబుతున్నారు. కట్టు కాలువ కూడా అభివృద్ధి చేసినా మొత్తం రూ.151.77 కోట్లు ఖర్చవుతుందని మొత్తంగా రూ.208.30కోట్లు ఆదా అవుతుందని రైతులు అధికారులు, ప్రజాప్రతినిదుల దృష్టికి తెచ్చారు.

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

రైతుల విన్నపాలు, సూచనలకు మంత్రి, ఎమ్మెల్యే కూడా మద్దతు పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా రైతుల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఇదే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. రైతులు కోరిన విధంగా డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6ను ఎన్టీఆర్ కాలువలో కలిపితే రైతుల భూములు కోల్పోయే అవకాశం లేదని, ప్రభుత్వానికి కూడా నిదులు ఆదా అయ్యే అవకాశం ఉందని చెపుతూ ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులు వేచి చూస్తున్నారు.



ఎన్టీఆర్ కాలువ (ఫైల్)

ప్రైవేటు ఆస్పత్రిలో లిఫ్ట్ ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

కేర్‌టేకర్స్ ఉన్నారు.లిఫ్ట్‌లో బటన్‌ను నొక్కగానే పైకి వెళ్లడానికి బదులు, ఉన్నట్టుండి ఒక్కసారిగా రెండో ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. దీంతో స్ట్రెచర్‌పై ఉన్న సరోజిని లిఫ్ట్‌లోనే ప్రాణం విడిచింది. ఆమెతో పాటు ఉన్న ఆస్పత్రి పేషెంట్ కేర్‌టేకర్స్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లిఫ్ట్ సెన్సర్లు పనిచేయక పోవడం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఆస్పత్రిలో ఏడేళ్ల క్రితం ఈ లిఫ్ట్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిసింది. రెగ్యులర్‌గా మెయింటేనెన్స్ కూడా చేయిస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. అయినప్పటికీ ప్రమాదం ఎలా జరిగిందనేది అంతుబట్టడం లేదు.

కాగా, ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే సరోజిని మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు, కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పారు. అయితే లిఫ్ట్‌కు ఈనెల 7నే మరమ్మతులు చేయించినట్లు, ప్రమాదవశాత్తు ఘటన జరిగిందని ఆస్పత్రి యాజమాన్యం చెబుతోంది. టూటౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. మృతురాలికి భర్త గురవయ్య, ఒక కుమారుడు వున్నారు. సరోజిని మరణంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గురవయ్య, అతడి కుమారుడు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు.



ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

పెళ్లింట విషాదం

(5వ పేజీ తరువాయి)

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని రాజేంద్రప్రసాద్ దంపతులు బంధుమిత్రులతో కలిసి తిలకించి, కారులో సత్తుపల్లికి బయల్దేరారు. బేతుపల్లి శివారులోని వెంచర్ సమీపంలోకి రాగానే సత్తుపల్లి నుంచి గంగారం వైపువెళ్తున్న మిల్క్‌వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేంద్రప్రసాద్, పుష్పావతి దంపతులను 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ పుష్పావతి మృతిచెందారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘ బాధ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



పుష్పావతి (ఫైల్)

పెళ్లింట విషాదం

గంట క్రితం వరకు కూడా తమతో కలిసి ఆనందంతో కనిపించిన తల్లి ఇక లేదు అనే వార్త తెలిసిన వెంటనే ఆ కుమార్తె కంటనీరు ఆపడం ఎవరి తరంకాలేదు. తల్లిదండ్రులకు ప్రమాదం జరిగిందనే విషయం తెలుసుకున్న కుమార్తె హర్షిణి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకోగానే అచేతనంగా పడివున్న తల్లిని చూసి భోరున విలపించింది. వివాహ సంబరాలు జరిగి వారం గడవక ముందే ఆ ఇంట విషాదం నెలకొనడంతో ప్రతీ ఒక్కరు ఆవేదన చెందారు.



గాయపడిన రాజేంద్రప్రసాద్

కోల్పోయిన అధికారాలను పునరుద్ధరించుకున్నాం

తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 'తహసీల్దార్లు.. ఆర్డీవోలు... జేసీలు కోల్పోయిన అధికారాలను మళ్లీ పునరుద్ధరించుకున్నాం... పూర్వపు వీఆర్వోలను తిరిగి మాతృసంస్థలోకి తీసుకోవడం ప్రభుత్వ చరిత్రాత్మక విజయం' అని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మంలో ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లచ్చిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు, మంత్రివర్గం, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల అందరి సహకారంతో అనతి కాలంలోనే రెవెన్యూశాఖలో అనేక చరిత్రాత్మక విజయాలు సాధించామన్నారు. 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించడం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్యను పెంచడం, గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామానికో అధికారిగా 10,954 పోస్టుల ఏర్పాటు అతి పెద్ద విజయాలుగా లచ్చిరెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాలలో పోస్టుల మంజూరు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకు పదోన్నతులు సాధించడం, తహశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు గతంలో కొల్పోయిన అధికారాలను భూభారతి చట్టం-2025తో పునరుద్ధరణ జరిగిందన్నారు.

పూర్వ వీఆర్ఏ, వీఆర్వోలను ఆప్షన్ పద్ధతిలో తిరిగి మాతృశాఖలోకి తీసుకోవడం హర్షణీయమన్నారు. 10 సంవత్సరాల తర్వాత, 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా మంజూరు, 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ యాజమాన్యం నుండి ప్రభుత్వ కార్పొరేషన్‌కు బదిలీ చేయడం, వీటితో పాటు రెవెన్యూ ఉద్యోగులుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందన్నారు. శాఖాపరమైన పదోన్నతులు, బదిలీలు, సీనియారిటీ అంశాలను గురించి చర్చించుకోవాల్సిన తవశ్యకత ఉందన్నారు.

ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్‌పాక, టీజీటీఏ సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు, మంగీలాల్, టీజీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూమాటి శ్రీనివాస్, భద్రాద్రి జిల్లా కన్వీనర్ కోట రవికుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, భద్రాద్రి జిల్లా టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భద్రూనాయక్, గుండు రాజులు, టీజీటీఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జాదవ్ మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అభిరామ్, మురళి, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, వీఆర్వోల సంక్షేమసంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు పాల్గొన్నారు



హాజరైన రెవెన్యూ ఉద్యోగులు

ఆలిండియా సైకిల్ యాత్రకు సుజాతనగర్ కుర్రాళ్లు

సుజాతనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైకిల్ యాత్రకు సుజాతనగర్ మండల ఇద్దరు కుర్రాళ్లు శుక్రవారం శ్రీకారం చుట్టారు. వీరి యాత్ర సఫలం కావాలని కుర్రాళ్లను గ్రామస్థులు దీవించి పంపారు. సుజాతనగర్ మండలం సీతంపేట బంజర గ్రామానికి చెందిన భూక్యా నాగేంద్రబాబు, అతని స్నేహితుడు మైలవరం గ్రామానికి చెందిన కుంజా రాజ్‌కుమార్ ఇరువురు కలిసి ఆలిండియా సైకిల్ యాత్రకు పూనుకున్నారు. వీరిద్దరు యూట్యూబ్ చానళ్లు నిర్వహిస్తున్నారు. వీరు ముందుగా అయోధ్య రామున్ని దర్శించుకుని అక్కడి నుంచి ఇతర రాష్ట్రాల కుండా తిరిగి భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ఇంటికి చేరుకుంటామని, గ్రామస్థుల సహకారంతో ఈ యాత్రకు పూనుకున్నామని వారు తెలిపారు. అంతుకు ముందు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.

వేసవిలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

భద్రాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఇప్పటికే గాల్వాలియం షెడ్లు ఉండగా అదనంగా మరికొన్ని సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి తాగునీటి సౌకర్యంను మరింతగా పెంచారు. అలాగే క్యూలైన్లో ఉన్న భక్తులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు.

అదేవిధంగా నిత్యకల్యాణ ప్రాంగణంలో కూలర్లను ఏర్పాటు చేశారు. కాగా ఆలయంలో దర్శనం ముగించుకుని తూర్పు మెట్ల వైపు నుంచి ప్రసాదాల కొనుగోలుకు వచ్చే భక్తుల కోసంకొబ్బరిపీచుతో చేసిన మ్యాట్‌లను వేశారు.





తాగునీటి సౌకర్యం, కొబ్బరిపీచుతో ఏర్పాటు చేసిన మ్యాట్

విద్యార్థినులకు ప్రశాంత వాతావరణం కల్పించాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- నర్సింగ్ వసతిగృహం పరిశీలన

కొత్తగూడెం, మార్చి21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతిగృహ విద్యార్థినులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ చెప్పారు. శుక్రవారం ఆయన వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులకు అందిస్తున్న సదుపాయాలలను తెలుసుకున్నారు. వసతిగృహంలోని అన్ని గదులను, మరుగుదొడ్లను, కిచెన్, తాగునీటి సౌకర్యం తదితర అన్ని సదుపాయాల్ని కలెక్టర్ పరిశీలించారు. మొత్తం 140మంది విద్యార్థినులకు ఒకే హాలులో ఉండటాన్ని గమనించిన ఆయన గదులుగా పార్టీషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. థర్మకోల్‌తో సీలింగ్ ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని, అన్ని గదుల్లో కూలర్లు, తాగునీటి కొరకు ఫ్రీజ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతిగృహం చుట్టు ప్రహరీ గోడను పరిశీలించిన కలెక్టర్ ఎత్తు తక్కువగా ఉండటాన్ని గమనించి విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బంది లేకుండ ప్రహరీగోడఎత్తు పెంచాలన్నారు. భద్రతకు కాను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని చెప్పారు.

అండర్‌పాస్.. ఎన్నికల టైంపాస్!

- ఎన్నికల సమయంలో నేతల హామీలు, తరువాత ఊసేలేదు
- మధిర పట్టణాన్ని రెండుగా విడగొట్టిన రైల్వే ట్రాక్
- రైలు పట్టాలు దాటుతూ అనేక మంది మృత్యువాత



రైలు వస్తుండటంతో ఆగిన పాదచారులు

మధిరటౌన్,మార్చి21 (ఆంధ్రజ్యోతి): పాత రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మించాలనే మధిర వాసుల డిమాండ్ ఎన్నికల టైంపాస్‌గా మారింది. ప్రతీసారి ఎన్నికల సమయంలో అండర్ నిర్మాణానికి హామీ ఇవ్వటం ఆతరువాత పట్టించుకోకపోవటం సర్వసాధారణంగా మారింది. రెండున్నర దశాబ్దాల క్రితం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో రైల్వే అధికారులు రైల్వేగేటును ఎత్తివేసి అడ్డుగా గడ్డర్లు ఏర్పాటు చేశారు. వృద్ధులు గేటుఅవతలకు పోవాలంటే రైల్వేబ్రిడ్జికి రెండువైపులా ఏర్పాటు చేసిన మెట్లు ఎక్కి దిగటం కష్టంగా మారింది.దీంతో పట్టాలు దాటి గడ్డర్లు కింద నుంచి దూరి అవతలకు ఇవతలకు తమ ప్రయాణాలు సాగిస్తుండేవారు, ఈక్రమంలో రైలు వచ్చేది చూసుకోకుండా రైలుఢీకొని పలువురు మృతి చెందారు. పదేళ్ల క్రితం రైలును గమనించకుండా పట్టాలు దాటుతున్న ఓవృద్ధుడిని కాపాడపోయి ఓప్రభుత్వ ఉపాధ్యాయుడు రైలు ఢీకొని మరణించడంతో రైల్వేఅధికారులు ప్రజలు రైలు పట్టాలు దాటి ప్రయాణించడానికి వీలు లేకుండా మూసివేశారు.

దెబ్బతిన్న వ్యాపారాలు

పట్టాలు దాటకుండా మూసివేయటంతో ప్రజలు ఇబ్బందులు పడటంతో పాటు రైల్వే గేటుకు ఇరువైపులా ఉన్న వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ప్రజలు, రాజకీయ పార్టీలు ఆందోళనల నేపథ్యంలో రైల్వే అధికారులను ఒప్పించి నడిచి వేళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. అప్పటినుంచి పాత రైల్వేగేటు వద్ద అండర్ పాస్ నిర్మించాలని మధిరకు వచ్చిన ప్రతీ రైల్వే అధికారికి, ప్రతి నాయకుడికి ప్రజలు, వ్యాపారులు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు.

మరికొద్దిరోజుల్లో పూర్తిగా మూసివేత

ఇటీవల మూడోరైల్వేలైన్ ఏర్పాటులో భాగంగా పట్టాలకు అవతల వైపున భూసేకరణ చేసి అనేక ఆక్రమణలను, నిర్మాణాలను తొలగించారు. తిరిగి ఆక్రమణలకు వీలు లేకుండా భారీగా కాంక్రీట్‌తో గోడను నిర్మిస్తున్నారు. పాత రైల్వే గేటు వద్ద కూడా రైలు పట్టాలు దాటేందుకు వీలులేకుండా గోడను నిర్మించనున్నారు. దీనితో మరికొద్ది నెలల్లోనే పాత రైల్వేగేటు వద్ద రాకపోకలు శాశ్వతంగా నిలిచి పోనున్నాయి. వ్యాపారులు తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, పాదాచారులు గేటు దాటేందుకు ఇబ్బందులుపడుతున్నామని, అండర్‌పాస్‌ను నిర్మించాలని కోరుతున్నారు.

వృద్ధులకు ఇబ్బంది
కటకం నరసింహారావు, వృద్ధుడు



మాకు రైలుపట్టాల అవతల, ఇవతల దుకాణాలు ఉన్నాయి. నిత్యం అటు ఇటు నడిచి వెళ్తూ, వస్తుంటాను. రైల్వేట్రాక్‌కు రెండు వైపులా గోడ నిర్మించి రాకపోకలకు అవకాశం లేకుండా చేస్తున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఉన్న మెట్లు ఎక్కి దిగాలంటే వృద్ధులకు చాలా కష్టంగా ఉంటుంది. ఖమ్మం సారధినగర్‌లో నిర్మించినట్లు ఇక్కడ కూడ కనీసం మనుషులు నడిచేందుకు వీలు కలిగేలా అండర్‌పాస్ నిర్మించాలి.

వ్యాపారాలు దెబ్బతింటాయి
శ్రీను, మెడికల్ షాపు నిర్వహకుడు



రైల్వేట్రాక్‌ను దాటేందుకు వీలు లేకుండా అధికారులు గోడ నిర్మిస్తున్నారు. రాకపోకలు లేకపోతే వ్యాపారాలు దెబ్బతింటాయి. ఎంతోమంది చిరు వ్యాపారులు ట్రాక్‌కు రెండు వైపులా వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. కనీసం ప్రజల రాకపోకలకు వీలు కలిగేలా అండర్‌పాస్ నిర్మించాలి. ప్రజాప్రతినిధులు మా బాధలు అర్థం చేసుకోవాలి.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన సింగరేణి డైరెక్టర్లు





రుద్రంపూర్,(సింగరేణి) మార్చి21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్లుగా నియమితులైన ఎల్‌వి. సూర్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు శుక్రవారం భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీరోహిత్‌రాజ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలతో సత్కరించారు. సింగరేణి యాజమాన్యానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ, ఎస్టేట్ జీఎం రాధాకృష్ణ, వివిధ విభాగాల అధికారులు వేణుమాదవ్, తావుర్యా, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా భాగ్యం కలిగించు పెద్దమ్మతల్లి

- పాల్వంచ ఆలయంలో మూలవిరాట్టుకు వినతిపత్రం
- ఇటీవల పాలకమండలి ఏర్పాటులో వివక్షపై స్థానికుల నిరసన



అమ్మవారికి వినతిపత్రం సమర్పిస్తున్న స్థానికులు

పాల్వంచరూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): అమ్మా.. పెద్దమ్మతల్లి.. ఎన్నో ఏళ్లనుంచి నీసేవకులుగా పనిచేస్తున్న మాకు అవకాశం ఇవ్వాలని శ్రీకనకదుర్గ దేవస్థానం మూలవిరాట్టుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. మండలపరిధిలోని కేపీ జగన్నాథపురం గ్రామంలో వెలిసిన శ్రీకనకదుర్గదేవస్థానం(పెద్దమ్మతల్లి) పాలకమండలి నియామకంపై కేశవాపురం-జగన్నాధపురం గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలకమండలిలో స్థానికులకు చోటు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ గర్భగుడిలోని అమ్మవారికి వినతిపత్రం ఇచ్చారు. అమ్మవారి సేవల్లో స్వచ్ఛందంగా ఈ గ్రామాల ప్రజలు పాల్గొని సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. అమ్మవారికి సేవచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని అమ్మవారిని వేడుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేపీ జగన్నాథపురం వాసులు కొండం పుల్లయ్య, గందం నర్సింహరావు, అడపాల వెంగళరావు పాటి వీరభద్రం, గందం సతీష్, లక్ష్మణ్, స్వరూప, కళ్యాణి, మల్లేశ్వరీ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఆర్‌ఎం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్(ఆపరేషన్, మెకానికల్)గా వి మల్లయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రీజనల్ మేనేజర్ ఎ.సరిరాంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

మూల్యాంకన కేంద్రానికి 183415 జవాబు పత్రాలు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మూల్యాంకనంపై అధికారులు దృష్టిసారించారు. మొత్తం నాలుగు సెషన్‌లుగా మూల్యాంకనం నిర్వహించనున్నారు. జిల్లాకు మొత్తం 297766 జవాబు పత్రాలు కేటాయించగా శుక్రవారంనాటికి 183415 జవాబు పత్రాలు వచ్చినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు తెలిపారు. మొదటి సెషన్ మార్చి 10నుంచి 22వరకు, రెండోసెషన్ 24న, మూడోసెషన్ 26న, నాలుగో సెషన్ 28న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆనందం రెండితలు

తొలి ప్రయత్నంలోనే రెండు ఉద్యోగాలు

దెందుకూరులో శశికుమార్, బచ్చోడు గ్రామంలో భౌమి ఉద్యోగాల సాధన





దారా శశికుమార్, ఆమంచి భౌమి

మధిరరూరల్, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన దారా శశికుమార్ తొలిప్రయత్నంలోనే ప్రభుత్వశాఖల్లో రెండుఉద్యోగాలు సాధించాడు. దారా రామారావు చిన్నకుమారుడైన శశికుమార్ 2022లో వచ్చిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ నోటిఫికేషన్‌లో భాగంగా రెండు శాఖల్లో ఉద్యోగాలకు పరీక్ష రాశాడు. టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ఓవర్‌సీసర్‌తో పాటు పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ టెక్నీకల్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు సాధించాడు.

కూసుమంచి: తిరుమలాయపాలెం మండలం బచ్చోడుగ్రామానికి చెందిన ఆమంచి భౌమి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. భౌమి ఏడాదివయస్సులోనే తండ్రి ఆమంచి శ్రీనివాసరావు గుండెపోటుతో చనిపోయాడు. అప్పటినుంచి తల్లిస్వప్న, తాతయ్య, అమ్మమ్మలు అన్నీ తామై పెంచారు. ఏడోతరగతి వరకు దమ్మాయిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో, పదోతరగతి ఖమ్మంలోనూ చదివింది. హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ డిప్లొమా, బీటెక్ చదివింది. డిప్లొమాలో 95 శాతం మార్కులతోనూ,బీటెక్‌లో గోల్డ్‌మెడల్ సాధించి ప్రతిభ చాటింది. టీజీపీఎస్సీ నిర్వహించిన పోటీ పరిక్షల్లో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో మిషన్ భగీరథలో ఏఈ గానూ, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో టీపీబీవోగా ఉద్యోగం సాధించింది. భౌమీ పెద్దనాన్న సత్యనారాయణ ప్రభుత్వఉపాధ్యాయుడిగానూ, బాబాయి ప్రొఫెసర్‌గానూ పనిచేస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన మిషన్ భగీరథ ఎస్ఈ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ ఎస్ఈగా జి శేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జగిత్యాలలో ఈఈగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఖమ్మం ఎస్ఈగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఈఈ పుష్పలత, గ్రిడ్ ఈఈ వాణిశ్రీ తో కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

మధిర రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామ శివారులో రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు సాంకేతిక లోపం కారణంగా శుక్రవారం ఉదయం మంటలు లేచాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న అయితం ప్రసాద్‌కు చెందిన సుబాబుల్ పొలానికి ఆమంటలు అంటుకున్నాయి. దీంతో రెండకరాల మేర సుబాబుల్ చెట్లు కాలిపోయాయి. స్థానిక రైతులు చూసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాలేదు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో కంటింగ్‌కు వచ్చిన సుబాబుల్ దగ్ధమైందని, రూ.రెండులక్షల నష్టం సంభవించిందని బాధిత రైతు ప్రసాద్ తెలిపాడు.

ఆత్కూరులో దొంగల హల్‌చల్

మధిర రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరులో గురువారం అర్ధరాత్రి తర్వాత దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలోని యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో చొరబడి మూడు గదుల తాళాలను పగులగొట్టారు. లోపలకు ప్రవేశించి బీరువా తాళాలను తీశారు. వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. ఆపక్కనే ఉన్న మధ్యాహ్నభోజనానికి సంబంధించి వంట గదిలోని కందిపప్పు, చింతపండులను ఎత్తుకెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున ఆరుగంటలకు పాఠశాల గదులు ఊడ్చేందుకు పనిమనిషి వెళ్లగా తాళాలు పగులగొట్టి కన్పించటంతో చోరీ జరిగిన విషయం గుర్తించి హెచ్‌ఎం శ్యాంప్రసాద్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు హెచ్‌ఎం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఈనెల 3న కూడా పాఠశాలలో దొంగలు ప్రవేశించి తాళాలు పగులగొట్టారని ఇది రెండోసారని హెచ్‌ఎం తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతితో గంగబండతండాలో ఉద్రిక్త

కూసుమంచి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగబండతండాలో శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. తండాకు చెందిన బాణోతు ఉపేందర్ అనే యువకుడు ఎలుకల మందు తీసుకుని మృతిచెందగా.. అందుకు విక్రయించిన వ్యాపారే కారణమని భావించి అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆందోళన చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పారు. వివరాలు పరిశీలిస్తే... గంగబండతండాకు చెందిన బాణోతు ఉపేందర్ అనేయువకుడు ఇటీవల ఎలుకల మందు సేవించి బలవన్మరణానికి ప్రయత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఇందుకు మృతుడి కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ అదేతండాకు చెందిన ఒక వ్యాపారిపై ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అనుమానితుని ఇంటివద్దకు వెళ్లి మృతదేహంతో ఆందోళన చేస్తామని చెప్పడంతో కూసుమంచి సీఐ సంజీవ్ వెంటనే అప్రమత్తమై సిబ్బందితో తండాకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మృతుని కుటుంబసభ్యులతో చర్చలు జరిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు దీంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

ద్విచక్ర వాహనం దహనం

నేలకొండపల్లి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టిన సంఘటన శుక్రవారం తెల్లవారుఝామున మండల పరిధిలోని నాచేపల్లి గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోగుల రాములు మూడు రోజుల క్రితం పాముకాటుకు గురై ఖమ్మంలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లుగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఇంట్లోనే ఉన్న రాములుకు చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుఝామున సాగర్ కాల్వ కట్ట వద్దకు తీసుకెళ్ళి తగులబెట్టారు.

ఆశలు రేపుతున్న మామిడి

- టన్నుకు రూ. లక్ష వరకు పలుకుతున్నధర
- జిల్లాలో మొదలైన కోతలు



ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/వేంసూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే మండే ఎండలతో పాటు మామిడి పండ్లుకూడా నోరూరిస్తాయి. మామిడి సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలోకూడా మామిడికాయల కోతలు మొదలయ్యాయి. మండల కేంద్రం వేంసూరులో బంగినిపల్లి మామిడిపండుకు టన్నుకు రూ.70వేలనుంచి లక్ష వరకు ధర పలుకుతోంది.. దీంతో మామిడిరైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో గిట్టుబాటు ధర లేక రైతులు చాలా తోటలు నరికివేసి ఆయిల్‌పామ్, జామాయిల్ తదితర తోటలవైపు మొగ్గుచూపారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 40వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ప్రధానంగా కామేపల్లి కారేపల్లి, వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, కూసుమంచి, తిరుమలాయపాలెం, రఘునాధపాలెం, చింతకాని,అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ తదితర మండలాల్లో మామిడి సాగవుతోంది.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ప్రతి సీజన్‌లోను ఉమ్మడి జిల్లాలో పండే మహారాష్ట్ర, యూపీ, ఢిల్లీ, హైదరాబాదు, చెన్నై,గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం కావంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు జిల్లాలో మామిడికాయలు కొనుగోలుచేసేందుకు ఆసక్తిచూపుతున్నారు ఇప్పటికే మహరాష్ట్రకు చెందిన పలువురు వ్యాపారులు జిల్లాలోని మామిడి కాయలు కొనుగోలు ప్రారంభించారు. మొదటగా వేంసూరునుంచి కొనుగోలు చేపట్టారు. ప్రస్తుతం బంగినపల్లికి రూ.70వేలనుంచి లక్ష వరకు ధర చెల్లించడంతో చివరి వరకు ఇదే ధర ఉంటే రైతులకు కాసులపంటే ప్రస్తుతం మామిడి దిగుబడులు కొన్ని గ్రామాల్లోనే రావడంతో మిగిలిన చోట్ల పిందే కాయదశలోనే ఎక్కువ తోటలున్నాయి.

అన్ని తోటల్లోను ఉత్పత్తి జరిగితే ధర తగ్గే పరిస్థితి ఉంది.సీజన్‌లో పూర్తిస్థాయిలో మామిడికాయలు మార్కెట్‌లోకి వస్తే టన్నుకు రూ.30వేల నుంచి 40వేల ధర ప్రతిసారి లభిస్తుంది.ఈసారి ఈధర నిలకడగా ఉంటుందా తగ్గుతుందా అన్నది చెప్పలేని పరిస్థితి. జిల్లాలో బంగినపల్లి, చిన్న, పెద్దరసాలు, కొబ్బరిమామిడి, తోతాపురి తదితర రకాల మామిడి సాగవుతుంది. అయితే జిల్లాలో పండే మామిడిపంటను రైతులు దళారులకే అమ్ముతున్నారు. రైతులవద్ద పండే మామిడిని స్థానిక వ్యాపారులు తక్కువ ధరకు కొనడం ఇతర రాష్ట్రాల వ్యాపారులకు అమ్మి ఎక్కువ ధర పొందుతున్నారు. కొందరు తోటలను కౌలుకు తీసుకోవడం కాయలు కొనుగోలు చేయడం జరుగుతోంది. గాలిదుమారాలకు అకాలవర్షాలకు భయపడి రైతులు ముందుగానే తోటలను కౌలుకు ఇచ్చి ధర ఉన్నప్పుడు నష్టపోతున్నారు.


సేంద్రియ మామిడికి డిమాండ్

మధుసూదన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



జిల్లాలో మామిడిసాగు అధికంగానే ఉంది.రైతులు స్థానిక మార్కెట్‌కే మామిడి అమ్ముతున్నారు. ఇతర రాష్ట్రాలకు విదేశాలకుఅమ్మితే గిట్టుబాటు ధర ఉంటుంది. ఇందుకు మామిడిఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. హైదరాబాదులోని అపెడా సంస్థ ఈ సంఘాలకు గుర్తింపు ఇస్తుంది. మహారాష్ట్రలో ఇలా రైతులు ఆయాపంటల ఉత్పత్తిదారుల సంస్థలు, సంఘాలు ఏర్పాటుచేసి బిజినెస్ రంగంలో రాణిస్తున్నారు. అధిక లాభాలు పొందుతున్నారు కేంద్ర ప్రభుత్వం కూడా ఇలా గుర్తింపు పొందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సంస్థలకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తుంది. వ్యాపార సంస్థగా రైతులు ముందుకు వెళ్లేందు కు రూ.25లక్షల వరకు రైతులకు ప్రోత్సాహం అందిస్తుంది. రైతులు తమపంటలను విదేశాలకు సైతం ఎగుమతి చేసేందుకు అపెడా సంస్థ మా ర్కెట్ సదుపాయం కలిపిస్తుంది. దీనికి రైతుసంఘాల, ఉత్పత్తిదారుల సంస్థలు రిజిస్ట్రేషన్ విధిగా చేయించుకోవాలి.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి



దుమ్ముగూడెం మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఆరోతరగతి విద్యార్థి సోయం సుకుమార్(12) శుక్రవారం మృతిచెందాడు. రక్తహీనత కారణంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యచికిత్సలు పొందుతుండగా పరిస్థితి విషమించింది. ఈ నెల 13న జ్వరంతో బాధపడుతున్న సుకుమార్‌కు ప్రాథమిక వైద్యంలో భాగంగా ఆశ్రమ పాఠశాల సిబ్బంది మాత్రలు ఇచ్చారు. మరుసటి రోజున హోలీ వేడుకల్లో చురుగ్గానే పాల్గొన్న సుకుమార్‌ను మెరుగైన వైద్యచికిత్సల కోసం తల్లి ఇంటికి తీసుకెళ్లింది. ఇంటివద్ద ఉన్న సుకుమార్ తీవ్ర అనారోగ్యానికి లోనవడంతో ములకపాడు పీహెచ్‌సీకు తరలించారు. పరీక్షల అనంతరం రక్తంలో హిమోగ్లోబిన్ రెండుశాతం వరకే ఉండడంతో వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికు సిఫారసు చేశారు. అక్కడ రక్తపరీక్షలు చేయగా హిమోగ్లోబిన్ కేవలం ఒకశాతానికి పడిపోవడంతో వెంటనే రక్తం ఎక్కించారు. మరుసటి రోజున పరీక్షలు నిర్వహించగా 8 శాతం వరకు పెరిగినట్లు సమాచారం. వెంటిలేటర్‌పై చికిత్సలు పొందుతున్న సుకుమార్ శుక్రవారం పరిస్థితి విషమించడంతో చనిపోయాడు. ఈనెల 13న ఇంటికి వెళ్లిన సుకుమార్‌కు స్థానికంగా ప్రైవేటు వైద్యం చేయించినట్లు తెలుస్తోంది. కొద్ది నెలలుగా అనారోగ్యంతో తరచూ బాధపడుతున్న సుకుమార్‌కు సకాలంలో మంచి వైద్యం అందక మృతిచెందాడనే ఆరోపణలు వినబడుతున్నాయి. సుకుమార్ తల్లిదండ్రులు కొడుకు మృతికి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రక్తహీనతే కారణమా?

గత ఏడాది డిసెంబరు నుంచి తరచూ అనారోగ్యంతో బాధపడుతున్న సుకుమార్ పరిస్థితిను వైద్యఆరోగ్యశాఖ ముందుగా గుర్తించకపోవడమే మృతికి కారణమని తెలుస్తోంది. రక్తహీనత సమస్యను అటు వైద్యశాఖ ఇటు తల్లిదండ్రులు గుర్తించలేదు.

సికిల్‌సెల్ ఎనీమియాతో మృతి: డిప్యూటీ డీఎంహెచ్ఓ

సుకుమార్ సికిల్‌సెల్ ఎనీమియాతో మృతిచెందాడని డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య తెలిపారు. ఆర్‌బీఎస్‌కే పరీక్షల్లో సమస్యను ముందుగా గుర్తించకపోవడం కూడా కారణం కావచ్చన్నారు. రక్తహీనత విషయం తల్లిదండ్రులకు ముందే తెలుసని, జన్యుపరంగా సమస్య ఉందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లి దళితవాడలో శుక్రవారం విద్యుదాఘాతానికి సంఘసాని నారాయణ (50) మృతి చెందాడు. కుటుంబసభ్యులు వివరాల ప్రకారం నారాయణ పక్క ఇంటి వారి అభ్యర్థనతో కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి కాయలు నరుకుతుండగా ప్రమాదశాత్తు ఆకు తెగి పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు తాకింది. నారాయణ కింద పడిపోయాడు. గ్రామస్థులు ఎర్రగుంట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు.

కేఎంసీకి ముగ్గురు టీపీబీవోలు



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక విభాగానికి ఇన్‌స్పెక్టర్‌స్థాయి అధికారుల కొరత తీరింది. టీజీపీఎస్సీ నియామకాల్లో కేఎంసీకి నలుగురు టీపీబీవోలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. వారిలో డీ.శశికుమార్, ఇటికల దుర్గాసాయికిరణ్ శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి ఉద్యోగంలో చేరారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు



పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో సిబ్బంది యోగా చేస్తున్న దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్,మార్చి21(ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతీ వ్యక్తికీ పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, తీవ్రమైన ఒత్తిడి నుంచి మానసిక ప్రశాంతత చేకూరుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్ లకు, సిబ్బందికి ఒక్కరోజు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సైదులు గారు మాట్లాడుతూ నిత్యం జీవనం యోగతో ప్రారంభం అయినప్పుడు ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గర్భిణులకు యోగా ద్వారా జరిగే ప్రయోజనాలు వివరించాలని కోరారు. సాధారణ ప్రసవాలు జరిగే శాతం ఎక్కువగా ఉంటుందని, ప్రతి స్టాఫ్‌నర్స్ యోగా గురించి తెలుసుకోవాలన్నారు. గర్భిణీగా నమోదు అయినప్పటి నుంచే యోగా గురించి అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతీ పీహెచ్‌సీలో, సబ్‌సెంటర్స్‌లో యోగా ట్రైనర్ లను నియమించామన్నారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ రామారావు, డీఎంహెచ్‌వో కార్యాలయం సిబ్బంది ఎన్ రఘురాం, కె రవితేజ, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

నగరంలో జోనల్ వ్యవస్థ

- ఐదు కార్యాలయాల ఏర్పాటు, ఉగాదిన ప్రారంభం
- 17మంది అధికారులు,ఉద్యోగుల నియామకం
- జోనల్ కార్యాలయాల్లోనే కేఎంసీ పౌరసేవలు

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ వంటి మహానగరల్లో జోనల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు.. తాజాగా ఖమ్మం నగరంలో ఈ వ్యవస్థకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య శ్రీకారం చుట్టారు. తద్వారా పరిపాలన వికేంద్రీకరణ జరిగిన ప్రజలకు సత్వర సేవలు అందటంతో పాటు సమయం ఆదా కానున్నది. దిన దినాభివృద్ధి చెందుతూ ఖమ్మం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ తర్వాత నగర పాలక సంస్థ వరకు హోదా మారింది. ఖమ్మంనగరం విలీన ప్రాంతాలతో భాగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటి వరకు ఖమ్మంనగరంలోని 60డివిజన్లు ఉన్నాయి. వారందరికీ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి సేవలు అందిస్తున్నారు. నగరంలోని శివారు ప్రాంత ప్రజలు చిన్నచిన్న పనులకు కేఎంసీకి వస్తున్నారు.

ఇప్పటికే లేట్

ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్య రెండు నెలలకే ఖమ్మం జోనల్ వ్యవస్థ విధానంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర



జోనల్ కార్యాలయంలో ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

రావు, మేయర్ పునుకొల్లు నీరజకు వివరించారు. నార్త్‌జోన్, ఈస్ట్‌జోన్, వెస్ట్‌జోన్ సౌత్ జోన్లు, సెంట్రల్ జోన్‌గా విభజించారు. వీటిపై పరిశీలనకు కేఎంసీ కార్యాలయం ఉంటుంది. ఈ విధానాన్ని వారు అంగీకరించటంతో సెప్టెంబరులోనే జోనల్ వ్యవస్థకు కార్యాచరణ జరిగింది. అయితే మున్నేరుకు వరదలు రావటం, ఇందిరమ్మ సర్వే, ప్రజాపాలన, ఆదాయ వసూళ్లు వంటి వరస కార్యక్రమాలతో జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు ఆటంకం కలిగింది.

సెంట్రల్ జోన్..

సెంట్రల్ జోనల్ కార్యాలయం ప్రస్తుత కేఎంసీలో ఏర్పాటు చేశారు. 43, 44, 45, 49, 50, 51, 52, 53, 54, 55, 56, 57, 58 డివిజన్ ప్రజలకు సేవలు అందిస్తారు.

కార్యాలయాల పరిశీలన

ఇప్పుడు కొంత వెసులుబాటు రావటంతో శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య జోనల్ కార్యాలయాల ఏర్పాటును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న వివరాలను సేకరించారు. ఆయాకార్యాలయాల్లో విభాగాల ఏర్పాటు ప్రక్రియను ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. దీంతో ఇకజోనల్ కార్యాలయాల ప్రారంభమే మిగిలింది.ఉగాది పర్వదినోత్సవం నాటికి జోనల్ కార్యాలయాలను ప్రారంభిచనున్నారు. ఇందుకోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారుల కేటాయింపు

ఖమ్మంలో నాలుగు జోనల్ కార్యాలయాలతో పాటుగా కేంద్రకార్యాలయంలో 13డివిజన్లు కేటాయించారు. ప్రతీ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, ఇంజనీరింగ్, ఇతర విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ రెండుడివిజన్లుకు కలిపి ఒక వార్డు ఆఫీసర్‌బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రతీ కార్యాలయంలో 17మంది అధికారులు, ఉద్యోగులు బాధ్యతలకు కేటాయించబోతున్నారు.

నార్త్‌జోన్..

1నుంచి 10 డివిజన్‌లకు ఖైకొండాయిగూడెంలోని పాతగ్రామపంచాయతీ కార్యాలయంలో నార్త్ జోన్ కార్యాలయానికి శ్రీకారం చుట్టారు. ఇక్కడి నుంచే ప్రజలకు సేవలు అందిస్తారు.



ఈస్ట్‌జోన్..

ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలోని కేఎంసీ పబ్లిక్ కార్యాలయంలో ఈస్ట్ జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. 11, 12, 13, 14, 15, 16, 19, 20, 21, 22, 41 డివిజన్లు దీని పరిధిలో ఉంటాయి.



వెస్ట్‌జోన్..

చర్చికాంపౌండ్ ప్రాంతంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం మొదటి అంతస్తును వెస్ట్ జోన్‌కార్యాలయం ఏర్పాటు చేశారు. 17, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 46, 47,48, 59, 60 డివిజన్లు ఉంటాయి.



సౌత్‌జోన్..

పాత మున్సిపల్ కార్యాలయాన్ని వెస్ట్‌జోన్ కార్యాలయంగా పరిశీలించి కేటాయించారు. ఈ కార్యాలయం పరిధిలోని 18, 23, 24,25, 26, 37, 38, 39, 40, 42 డివిజన్లు ఉంటాయి. ఆ ప్రాంతాల ప్రజలకు సేవలందిస్తారు.



గులాబీపూలతో ప్రయాణికులకు స్వాగతం



ప్రయాణికులకు గులాబీపూలు అందిస్తున్న కండక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటి బస్టాండ్‌లో శుక్రవారం ప్రయాణికులకు ఆర్టీసీ కండక్టర్లు గులాబీ పూలు అందించి హ్యాపీ జర్నీ అంటూ స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భద్రత, సౌకర్యవంతంగా ఉంటుందని డిపో మేనేజర్ దినేష్ కుమార్ వివరించారు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు సాగించాలని స్వాగతం పలికి గులాబీలు అందించారు. ప్రయాణికులు ఉత్సాహంతో జై ఆర్టీసీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ రామయ్య, ఎస్ఎం సతీష్, కంట్రోలర్ మాధవరావు కండక్టర్లు శైలజ, రవి, తదితరులు పాల్గొన్నారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో 27న మండలాల్లో నిరసన

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కనీస హామీలు అమలు కోరుతూ ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తామని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఝాన్సీ, కోలేటి నాగేశ్వరరావు,శిరోమణి, కే శ్రీనివాస్, శోభ, కే.లక్ష్మణ్, రాకేష్ పాల్గొన్నారు.

'బంతి బువ్వ' పుస్తకావిష్కరణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం డాక్టర్ రామారావు గంజికుంట్ల రచించిన బంతి బువ్వ ఖమ్మం జిల్లా మాండలిక పదాల పుస్తకాన్ని ప్రముఖ కవి కాళోజి పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ సీతారాం ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని పదాలు భాషను మరో 50 సంవత్సరాలు బ్రతికించిందని, ఇలాంటి పుస్తకాల వలన భాషా, సంస్కృతి, పదాలు, పదబంధాలు పునరుజ్జీవింపచేయటానికి అవకాశం ఉందని సీతారాం అన్నారు. పొనుగంటి రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతిలు మాట్లాడారు.

చివరి భూములకు సాగునీరు

తిరుమలాయపాలెం, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుచేసిన వరి,మొక్కజొన్న,పెసర పసంటలు ఎండిపోకుండా చివరి భూములకు కూడా సాగునీరు అందిస్తామని తహసీల్దార్ పీవీ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం బీరోలు, బచ్చోడు, జూపెడ, రాజారం, పైనంపల్లి, కాకరవాయి, సోలిపురం గ్రామాల్లోని చెరువులు, కుంటలను భక్తరామదాసు ద్వారా విడుదలవుతున్న నీటి వనరులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఖమ్మంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఏడీఈ రామకృష్ణ అధికారులకు సూచించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో విద్యుత్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎటువంటి సమస్యలు అయినా అధిగమించి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి తెలిపారు. వినియోగదారులకు ఫోన్లు చేసిన వెంటనే సిబ్బంది స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయ్య

కూసుమంచి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో జిల్లా అధ్యక్షుడు అంబాల రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సోమయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నియంత పాలనలో ఉద్యమద్రోహులను అందలం ఎక్కించడంతో ప్రజలు చరమగీతం పాడారని గుర్తు చేశారు. అందుకు ఫలితంగా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ⁻ హామీ ఇచ్చి ఏడాది దాటినా ముఖ్యమంత్రి అమలు చేయడం లేదని తెలిపారు. ఉద్యమకారులను విస్మరిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. అనంతరం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మితిరుపతమ్మ బోనాలు



కామేపల్లి,మార్చి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ తల్లి బోనాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం గ్రామంలో మహిళలు బోనాలు సమర్పించారు. ఇటీవల గోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. 16రోజులు గడుస్తుండడంతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల బాబు, పుచ్చకాయల శ్రీనివాస్, పుచ్చకాయల కోటయ్య, చిన్న వెంకటేశ్వర్లు, క్రిష్ణ, వెంకటస్వామి, తుపాకుల రమేష్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆటో బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

కామేపల్లి,మార్చి21(ఆంధ్రజ్యోతి):బైక్‌నుఓఆటో ఢీకొన్న సంఘటనలో ఓవ్యక్తి తీవ్రగాయాలైన సంఘటన కామేపల్లి మండల పరిధిలోనిమద్రిగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం హరిచ్చంద్రాపురానికి చెందిన జర్ప రమేష్ ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా ఓ ఆటో ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయలు కావడంతో 108లో ఆస్పత్రికి తరలించారు.

వీధులు పరిశుభ్రంగా ఉంచాలి

ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మంరూరల్,మార్చి21(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీలోని అన్నివీధులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటిలోని నాయుడుపేట,పెద్దతండా తదితర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలను శుక్రవాం సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆయా వీధుల్లోని డ్రెయిన్లను శుభ్రం చేయించారు. నిత్యం వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

నాలుగో తరగతి ఉద్యోగుల ఇఫ్తార్

ఖమ్మంకలెక్టరేట్,మార్చి21(ఆంధ్రజ్యోతి):తెలంగాణ నాల్గోతరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఒకరినొకరు అభినందించుకున్నారు. ఈ కార్యక్రమంలో మోదుగు వేలాద్రి, కోడి లింగయ్య, గఫార్‌పాషా, ఆర్ వెంకటేశ్వరరావు, అంజయ్య ,సిద్దిక్, కోటేశ్వరరావు, రహేమాన్, చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన



వైశాలిని సత్కరించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్‌లో పతకాన్ని సాధించిన వైశాలిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈనెల10నుంచి 12వరకు బీహార్ రాష్ట్రం, పాట్నాలో జరిగిన జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్‌లో ఖమ్మంక్రీడాకారిణి బి.వైశాలి రజత పతకము సాధించింది. ఐదేళ్లుగా తెలంగాణ రాష్ట్రానికి జాతీయస్థాయిలో పాల్గొని 6 బంగారు పతకాలు, 2 రజత పతకాలు మరో రెండు కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి కలెక్టర్‌కి వివరించారు. వైశాలితో పాటు ఆమె తండ్రి కొండా యాదవ్, కోచ్ యం.డి.గౌస్‌ను కలెక్టర్ సత్కరించారు. తుంబూరు సునీల్‌రెడ్డి, ఛైర్మన్ నున్నా రాధాకృష్ణ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యం.వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఎండీ షఫీక్ అహ్మద్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు

ఇటీవల మరణించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు తక్కేళ్లపల్లి శ్రీనివాస్ భార్యకు ఉద్యోగం కల్పించాల్సిందిగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కోరారు. టీఎన్జీవో జిల్లా కమిటీ గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలెక్టర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. శ్రీనివాస్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాన్ని ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వల్లపు వెంకన్న, ప్రచార కార్యదర్శి యర్రమళ్ళ శ్రీను, ఉపాధ్యక్షులు కరణ్‌సింగ్, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, ఎస్‌కె అస్లాం, శంకర్, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం లక్ష్మణ్ రావు తదితరులున్నారు.

రైతు వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు

- సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి21(ఆంధ్రజ్యోతి):కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై వివక్ష చూపుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌శక్తులకు అప్పగించే కుట్రలు చేస్తున్నాయని రైతు వివక్షపై తెలంగాణ రైతుసంఘం పోరాటాలు చేసేందుకు కార్యచరణ రూపొందించామని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన సంఘం జిల్లా కమిటీతో కలిసి వారు శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైరాలో నిర్వహించిన జిల్లా మహాసభలు తీర్మానాలు, భవిష్యత్‌కార్యచరణను వివరించారు. ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వంపై పోరాటాలు చేసి రైతుల హక్కులను కాపాడుతామని,24,25,26న నిజామాబాద్‌లో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు.ఈ సమావేశంలో మిడికంటి వెంకటరెడ్డి,బాణోత్ రామ్‌కోటి, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దొబ్బల వెంగళరావు, బాగం ప్రసాద్, బాణోత్ రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు 30ఏళ్ల దాటిన మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు తెలిపారు. స్వస్థ మహిళ-స్వస్థ భారత్ కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన, ఉచిత పరీక్ష (స్క్రీనింగ్) కార్యక్రమం నిర్వహించారు. మహిళలల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌ని పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.మహిళలు దీన్ని నిర్లక్ష్యం చేయడం



వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్రతీరోజులో ఆరుగురిలో ఒకరు ఈ వ్యాధి బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల పైబడిన 60 ఏళ్ల లోపు మహిళలు విధిగా సంబంధిత పరీక్షలు చేయించుకోలని, వ్యాధినిర్ధారణ అయితే వైద్యుల సూచనల మేరకు తగిన చికిత్సా పొందాలని సూచించారు. వైద్యాధికారి దేవిశ్రీ మాట్లాడుతూ ప్రతీ మహిళ నెలకు ఒక్కసారి తప్పనిసరిగా సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల క్యాన్సర్ ప్రబలకుండా అరికట్టవచ్చన్నారు. ఈకార్యక్రమంలో యువీకెన్ ఫౌండేషన్ బాధ్యులు మహిళలు, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం లకు ఈవ్యాధి పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజేశ్వరి, సూపర్వైజర్ జయపాల్ విజయకుమార్, యూవీకెన్ ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ బి. హరిత, కోఆర్డినేటర్లు కె. విద్యా తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీతో సమావేశం

ఖమ్మంకలెక్టరేట్, మార్చి21(ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. మొత్తంగా జిల్లాలో రూ.11463 కోట్లు డిసెంబర్, 2024 నెల వరకు బ్యాంకుల ద్వారా అందించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 891 మహిళా సంఘాలకు 2024-25 సంవత్సరానికి రూ.17769.95 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పటి వరకు అందించామన్నారు. పీఎంఈజీపీ, సీఎంఎఫ్ఎంఈ రుణాలు లబ్ధిదారులకు సకాలంలో అందించాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్డీఎం శ్రీనివాస రెడ్డి, ఆర్బీఐ ఎల్డిఓ పల్లవి, నాబార్డ్ డీడీఎం సుజిత్ కుమార్, ఎస్బీఐ ఆర్ఎం జి. లింగస్వామి, యూబీఐ డీజీఎం హనుమంత రెడ్డి, టీజీఎం ఆర్ఎం విజయ్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వాసవిరాణి పాల్గొన్నారు.



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

పరీక్ష కేంద్రంలో మూర్ఛపోయిన విద్యార్థి

108లో నేలకొండపల్లి తరలింపు



చికిత్స చేస్తున్న సీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్

నేలకొండపల్లి,మార్చి21(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో అపశ్రుతి దొర్లింది. చెర్వుమాధారం పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరైన రాయగూడేనికి చెందిన బోయిన ధనుష్ పరీక్ష రాస్తూ ఒక్కసారిగా మూర్ఛతో కింద పడిపోయాడు. వెంటనే స్పందించిన సిబ్బంది ధనుష్‌ను చెర్వుమాధారంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి రాజేష్ విద్యార్థి ధనుష్‌కు చికిత్స అందించారు. కోలుకున్న అనంతరం తిరిగి పరీక్ష రాయించారు. శుక్రవారం పరీక్ష వ్రాయాల్సి ఉండటంతో ఆందోళనకు గురై మూర్ఛపోయి ఉంటాడని తెలుస్తున్నది. 108లో నేలకొండపల్లి తరలించే క్రమంలో ఈఎంటీ పుష్పలత, పైలట్ అజీముద్దీన్ 108లో ధనుష్‌కు ప్రాథమిక చికిత్స అందించారు.



అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ముదిగొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసాచారి స్పష్టం చేశారు. శుక్రవారం ముదిగొండ మండలం న్యాలక్ష్మీపురం గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం వద్ద రూ.80లక్షలతో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్‌శాఖ వేసవి ప్రణాళికలో భాగంగా వేసవికాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ డివిజన్ ఇంజనీర్ నాగేశ్వరరావు, భద్రు పవార్, రాందాస్, ఏడీఈ బోజ్యా, ఏఈలు శ్రీనివాసరావు, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దినదినాభివృద్ధి చెందుతున్న బీజేపీ



ఆలయంలో పూజలు చేస్తున్న నెల్లూరి కోటేశ్వరరావు

తల్లాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులు కావడంతో జిల్లాలో బీజేపీ బలపడుతోందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన కోటేశ్వరరావు తల్లాడ మండలం అంజనాపురంలోని అభయాంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో అంకితభావం ఉన్న సామాన్య కార్యకర్తలకు కూడా ఉన్నతస్థాయి పదవులు లభిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాలు గెలుచుకునేలా ప్రతి పార్టీ కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కూసంపూడి రవీంద్ర, నంబూరి రామలింగేశ్వరరావు, శ్యామ్ రాథాడో నున్నా మిశ్రామ, ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, తమ్మిశెట్టి కృష్ణ, చల్లా నరేష్, పెరిక కిరణ్ పాల్గొన్నారు.

ఓసీని సందర్శించిన సింగరేణి సేఫ్టీ అధికారి

సత్తుపల్లిరూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీతో పాటు మండలంలోని కిష్టారం వద్ద ఉన్న సింగరేణి సీహెచ్‌పీని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ (ఎలక్ట్రికల్) ఆనందవేలు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ రక్షణ విషయంలో యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీవో ఎస్‌వీఆర్.ప్రహ్లాద్, ఏఈ కేఎస్ఎన్.రాజు, రక్షణాధికారి ఎం.వెంకటేశ్వరరావు, అధికారులు డీ.శ్రీనివాసరావు, బీ.రాజేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి ఎంపిక

కల్లూరు, మార్చి21 కల్లూరులోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ నూతన పాలక మండలిని ఎంపిక చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు అందినాయి. అందులో కల్లూరు పట్టణానికి చెందిన దారా రంగాను ఆలయ చైర్మన్ నియామకం చేసేందుకు సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే రాగమయి ఆమోదం తెలిపినట్లు తెలిసింది. సభ్యులుగా బొప్పన శ్రీనాథ్, అజ్మీర రామకృష్ణ, కుంచాల వీరయ్య, వలసాల నరేంద్రబాబు, బొడ్డు పిచ్చయ్య, తోట మణి (మహిళ)ని ఎంపిక చేస్తూ పై విధంగా దేవాదాయశాఖ నుంచి పాలకమండలి సభ్యులకు ఆదేశాలు అందినాయి. ఈ ఆలయానికి పాలక మండలి సభ్యులుగా మొత్తం 7 గురు సభ్యులు కాగా వారిలో నుంచే ఒకరు ఛైర్మన్‌గా, మరొకరు వైస్ ఛైర్మన్ ఎంపిక అవుతారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి సూచనల మేరకు త్వరలో కల్లూరులోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా దారా రంగా ఎంపిక కానున్నారని తెలిసింది.

సబ్ యార్డుల అభివృద్ధికి కృషి



మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న నర్సింహారావు

బోనకల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ సబ్ యార్డుల అభివృద్ధి కోసం అంకితబావంతో పని చేస్తానని ఏఎంసీ ఛైర్మన్ బండారు నరసింహారావు తెలిపారు. బోనకల్, చిరునోముల గ్రామాలలో ఉన్న మార్కెట్ సబ్ యార్డులను శుక్రవారం ఆయన సందర్శించారు. బోనకల్‌లో సబ్ యార్డులో గల స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్లాట్‌ఫాంల నిర్మాణాల మంజూరు గురించి ఆయన రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా చిరునోములలో మరో గోదాంతో పాటు సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సంప్రదించి త్వరితగతిన నిధులు మంజూరు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, గూడ నర్సయ్యశాస్త్రీ, మరీదు శ్రీను, గుగులోతు రమేష్, బద్రు నాయక్, జాన్‌బాషా పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మధిరటౌన్,మార్చి21(ఆంధ్రజ్యోతి): రవాణా రంగం పరిరక్షణ, ఆర్టీసీల బలోపేతం కోసం రవాణా కార్మికులు మార్చి 24న తలపెట్టిన చలో ఢిల్లీ పార్లమెంట్ వాల్ పోస్టర్‌ను శుక్రవారం డిపో వద్ద ఆవిష్కరించారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, రవాణ రంగాన్ని పరిరక్షించాలని, ఎలక్ట్రిక్ వాహనాలు ఆర్టీసికి ఇవ్వాలని కోరుతూ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఆందోళనలో భాగంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఎఐటియుడబ్లుఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీనా మజాకానా..?

కొలతల్లో కిలోమీటర్ రోడ్డు గాయబ్

వైరా, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల దూరం కొలతల తేడాల్లో తమ ఘనతను చాటుకున్నారు. ఏకంగా ఒక్క కిలోమీటర్ రోడ్డు దూరాన్ని తగ్గిస్తూ కిలోమీటర్ రాళ్లను ఏర్పాటుచేశారు. వైరా నుంచి స్టేజీ పినపాక-కనకగిరి సిరిపురం మీదుగా నెమలి వెళ్లే రోడ్డులో ఆర్‌అండ్‌బీ కొలతల్లో ఒక కిలోమీటర్ రోడ్డు లేచిపోయింది. దాదాపు 30సంవత్సరాల కిందట ఈ రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించారు. అప్పటి నుంచి ఉన్న రోడ్డు దూరం కాస్తా ఈ ఏడాది ఒక్కసారిగా కిలోమీటర్ దూరం తగ్గిస్తూ కిలోమీటర్ రాళ్లను ఏర్పాటుచేయడంతో ఈ రూట్లోని గ్రామాల ప్రజలు, ఇతరులు ఆశ్చర్యపోతున్నారు. వైరా నుంచి ఏపీలోని నెమలి 21కిలోమీటర్ల దూరం ఉంది. అయితే నెమలి రూట్లో రోడ్డును స్టేజీ పినపాక-పాత పినపాక మధ్య ఉన్న క్రాస్‌రోడ్డు నుంచి కిలోమీటర్ రాళ్లపై కొలతల్లో చూపుతున్నారు. క్రాస్‌రోడ్డు నుంచి నెమలి 16 కిలోమీటర్ల దూరం ఉంది. ఇదే క్రాస్‌రోడ్డు నుంచి వైరా ఐదుకిలోమీటర్ల దూరం ఉంది. అయితే ఇటీవల కిలోమీటర్ల రాళ్లకు కొత్తగా రంగులు వేసి వాటిపై కిలోమీటర్ల దూరాన్ని రాశారు. క్రాస్‌రోడ్డు వద్ద నెమలి దూరం



స్టేజీ పినపాక-పాత పినపాక మధ్య క్రాస్‌రోడ్డు వద్ద మరో రాయి



స్టేజి పినపాక-సిరిపురం మధ్యలో కిలోమీటరు రాయి

16 కిలోమీటర్లు ఉండాల్సి ఉండగా 15 కిలోమీటర్లు అని రాశారు. ఇక అక్కడి నుంచి ఏకంగా నెమలి వరకు కిలోమీటర్ చొప్పున రోడ్డు దూరం తగ్గించి రాళ్లపైన కిలోమీటర్ల అంకెలు వేశారు. అసలు విషయానికొస్తే... నెమలి వైపు నుంచి క్రాస్‌రోడ్డు వైపు వచ్చే సమయంలో కిలోమీటర్ రాళ్లపై పేర్కొన్న అంకెల్లో తప్పిదం జరిగినట్లు స్పష్టమవుతుంది. అయితే నెమలి నుంచి ప్రారంభమైన ఈ రోడ్డు క్రాస్‌రోడ్డు వరకు చేరుకోకముందే కిలోమీటర్ ముందుగానే అంటే క్రాస్‌రోడ్డు-సిరిపురం మధ్యనున్న ఒక కిలోమీటర్ రాయిపైన ఆర్‌అండ్‌బీ రోడ్డుగా రాశారు. అక్కడ 15వ కిలోమీటర్ అని రాయాల్సి ఉంది. అందుకు భిన్నంగా ఎలాంటి రోడ్డు లేకుండానే కిలోమీటర్ అంకెకు బదులు ఆర్‌అండ్‌బీ రోడ్డుగా రాసి వదిలేశారు. అదే సమయంలో కిలోమీటర్ తర్వాత క్రాస్‌రోడ్డు వద్ద కూడా ఆర్‌అండ్‌బీ రోడ్డుగానే పేర్కొన్నారు. కొత్తగా ఒక కిలోమీటర్ దూరాన్ని లేపేసి కిలోమీటర్ దూరంలో ఉన్న రెండు రాళ్లపై అంకెలకు బదులుగా ఆర్‌అండ్‌బీ రోడ్డుగా రాసి వదిలేశారు. దాంతో ఈ రోడ్డులోని ప్రయాణీకులకు ఒక్కసారిగా కిలోమీటర్ దూరం ఎలా తగ్గిందని ఆశ్చర్యపోవడం వారి వంతైంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు తమ నిర్లక్ష్యం వలన జరిగిన తప్పిదాన్ని సరిచేయాలని ఈ రూట్ ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: పువ్వాళ్ల

వైరా, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నారపనేనిపల్లి రైతులు తమ సన్నరకం ధాన్యానికి బోనస్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సీఎం, డిప్యూటీ సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆలోచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తుందని అలాగే రూ.రెండులక్షల రుణమాఫీ, రైతుభరోసా అమలుచేస్తుందని తెలిపారు. రైతుల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలను వంచించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు రాత్రింబవళ్లు రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్నారని తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు శీలం వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మచ్చా బుజ్జి, బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, చింతనిప్పు మాధవరావు, పల్లపు కొండలు, గుగులోతు రాము, పూసలపాడు సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గాలి శ్రీనివాసరావు, గారపాటి గోపాలరావు, మాజీ సర్పంచ్‌లు శీలం సుజాత, సత్యనారాయణరెడ్డి, మోదుగు తిరుమలి, గుడిద ఏడుకొండలు పాల్గొన్నారు.



క్షీరాభిషేకంలో పాల్గొన్న పువ్వాళ్ల దుర్గా ప్రసాద్

ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలి

సత్తుపల్లి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): కార్పోరేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రజలంతా మెరుగైన సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రులలోనే వైద్య సేవలు పొందాలని డీఎంహెచ్‌వో కళావతిబాయి కోరారు. 14వ ఆర్థిక సంఘ నిధులతో స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో నూతనంగా నిర్మించనున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆమె శంకుస్థాపన చేశారు. సమీప ప్రాంత ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేపట్టామని, ప్రయివేట్‌లో వైద్యం చేయించుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని కోరారు. ప్రజలంతా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ వేసవిలో దప్పిక అవ్వకముందే తాగునీటిని తీసుకోవాలని, సమయపాలన పాటించి భోజనం చేయాలని కోరారు. వడదెబ్బ తగిలిన వారు వెంటనే సమీపంలోని ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ కే.నర్సింహ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.టీ.సీతారామ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్ర ప్రారంభం

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి తనిఖీ

కల్లూరు: కల్లూరులోని ఓ ప్రైవైట్ ఆసుపత్రిని శుక్రవారం డీఎంహెచ్‌వో కళావతిబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులు, ఐసీయూ రూమ్, వార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆసుపత్రి సేవలు, ఫీజుల పట్టికను ప్రదర్శించాలని, అర్హత ఉన్న సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని, ల్యాబ్‌లో అవసరం లేని పరీక్షలను చేయరాదని, రోగుల వద్ద అధిక ఫీజులు వసూలు చేయరాదని ఆసుపత్రి యాజమాన్యంకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చటపరమైన చర్యలు తీసుకుంటామని సదరు ఆసుపత్రి వైద్యుడు చైతన్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు నవ్యకాంత్, మాస్ మీడియా అధికారి సాంబశివరెడ్డి, డిపివో దుర్గ, హెల్త్ సూపర్‌వైజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ముదిగొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసాచారి స్పష్టం తెలిపారు. శుక్రవారం ముదిగొండ మండలం న్యాలక్ష్మీపురం గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం వద్ద రూ.80లక్షలతో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్‌శాఖ వేసవి ప్రణాళికలో భాగంగా వేసవికాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ డివిజన్ ఇంజనీర్ నాగేశ్వరరావు, భద్రు పవార్, రాందాస్, ఏడీఈ బోజ్యా, ఏఈలు శ్రీనివాసరావు, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకారం అభినందనీయం

తల్లాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిస్వార్థ ఇండియా ఫౌండేషన్ వంటి సేవ సంస్థల సహకారం అభినందనీయమని ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం మిట్టపల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో నిస్వార్థ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16డబుల్‌డెస్క్ బెంచీలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఎం.శ్రీనివాసరావు, నాగభూషణం, షేక్.రంజాన్, కె.శ్రీనివాసరావు, రాయల నర్సింహారావు, వసంతవాణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

మధిరటౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మధిర రూరల్, పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, పల్లపోతుల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మధిరలోని బీఆర్ఎస్ పార్టీ నూతన క్యాలండర్, డైరీని వారు ఆవిష్కరించారు. భవిష్యత్తు బీఆర్ఎస్ దేనని పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవలసిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మొండితోక లత, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటేశ్వరరావు బీఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు బిక్కి. కృష్ణప్రసాద్, సోషల్ మీడియ ఇంచార్జ్ హరీష్, యూత్ అధ్యక్షులు అబ్బూరి రామన్, జిల్లా నాయకులు జయాకర్, నాగేశ్వరావు, నాగేశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీని తొలగించాలని వీవోఏల ధర్నా



వినతిపత్రం సమర్పిస్తున్న వీవోఏలు

కల్లూరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): అర్హతలేని శ్రీనిధి సీఆర్‌పీని తొలగించాలని డిమాండ్ చేస్తూ కల్లూరులో ఉషోదయ గ్రామ సమైఖ్య కార్యాలయం వద్ద గ్రామదీపికలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి మాట్లాడుతూ ఏ స్వయం సహాయక సంఘంలో లేని మాతిపోగు దయావతిని తొలగించాలని అధికారులను కోరారు. మండల వీవోఏల అధ్యక్షురాలు నిర్మల, శైలజ, షాహనాజ్, సుజాత, ఓబీ సభ్యులకు వీవోఏలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కుమారి, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, సహాయ కార్యదర్శి వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో ప్రవేశాలకు..
దరఖాస్తుల ఆహ్వానం

వైరా, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం సెయింట్ మెరీస్ పాఠశాలలో నిర్వహిస్తున్న ములిసమడుగు మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలికల పాఠశాలలో ఈ విద్యాసంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రాధికారెడ్డి సూచించారు. ఈ పాఠశాలలో 6,7,8,9తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించే పరీక్ష కోసం ఈనెల 31వతేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20వతేదీన ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి వచ్చిన మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

కళలకు పుట్టినిల్లు మధిర: కొండబాల

అలరించిన తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కొండబాల

మధిరటౌన్,మార్చి21(ఆంధ్రజ్యోతి): కవులకు, కళలకు, కళాకారులకు మధిర పుట్టినిల్లు వంటిదని మధిర మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మధిరలోని వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రెండ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలకు ఆయన ముఖ్యఅతిదిగా హాజరయ్యారు. రంగస్థల కళలు అంటే టక్కున గుర్తొచ్చేది మధిర అని అందులో ముందు వరసలో ఉండేది కృష్ణప్రసాద్ అని అన్నారు. ప్రతి సంవత్సరం మధిర లో వివద కళాపరిషత్ వారు నాటక పోటీలను నిర్వహిస్తూ అంతరించి పోతున్న ఈ కళలను బతికిస్తున్నారని అన్నారు. తొలిరోజు పలువురు కళాకారులు ప్రదర్శించిన దుర్యోదుని ఏకపాత్రాబినయం, సత్యహరిశ్చంద్ర లోని కాటికాపరి సీను తో పాటు పలు సాంఘీక కళారూపాలు ఆహతులను అలరించాయి. టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గడ్డం శ్రీనివాసరావు, సుబ్బారావు, పుతుంబాక కృష్ణప్రసాద్, మునుగోటి వెంకటేశ్వర్లు, గురువులు, బాబ్లా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లు సోదరభావాన్ని పెంచుతాయి: సండ్ర



సామూహిక ప్రార్థనలో పాల్గొన్న సండ్ర

సత్తుపల్లి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లీంల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని జామే మసీద్‌లో ముస్లీం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లీం సోదరులకు ఆయన రోజా విడిపించి ఫలహారం తినిపించారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనుషులంతా సోదరభావంతో ఉండాలని, రాబోయే రంజాన్ పర్వదినాన్ని ముస్లీంలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపకోవాలని కోరారు. కార్యక్రమంలో జామె మసీద్ సదర్ నాయబ్‌రసూల్, మాజీ సదర్ మోనార్క్ రఫీ, నాయకులు ఎండీ.కమల్‌పాషా, గ్రాండ్ మౌలాలీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సత్తుపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే యూత్ పార్లమెంట్-2025 రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని దాసరి సిరి ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపాల్ డా.నండ్రు గోపి మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన కళాశాల స్థాయిలో వికసిత్ భారత్ అంశంపై ఒక్క నిమిషం వీడియో అప్‌లోడ్ చేసే అంశంలో 12మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో 11మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపకవ్వగా 19న ఖమ్మంలో జిల్లా స్థాయిలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో పాల్గొనగా ప్రతిభకనబరిచిన దాసరి సిరి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సిరిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

జీవ, వృక్షజాతులకు పునరుజ్జీవం ఇద్దాం

సత్తుపల్లిరూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న జీవ, వృక్ష జాతులకు పునరుజ్జీవనం ఇద్దామని సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ స్నేహలత కోరారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయం నుంచి రింగ్ సెంటర్ మీదుగా పాతసెంటర్ అక్కడి నుంచి నీలాద్రి అర్బన్ పార్క్ వరకు అటవీ శాఖ సిబ్బంది ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు, బేస్ క్యాంప్, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో చలివేంద్రం ప్రారంభం

సత్తుపల్లిరూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్ తెలిపారు. సత్తుపల్లి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు, ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.ఆయేషా షరీన్, కోర్టు అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ బోయినపల్లి రవికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏన్కూరు ఎంఈవోగా రహింబీ



ఏన్కూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి): తిమ్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రహింబీ ఏన్కూరు ఎంఈవోగా నియమితులయ్యారు ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్ ఫిబ్రవరి 28న పదవీ విరమణ పొందారు అప్పటినుండి ఎంఈవో పోస్టు ఖాళీగా ఉంది. రహింబీ నియామకం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

మక్క పంటల పరిశీలన

బోనకల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో శుక్రవారం మక్క పంటలను తహసీల్దార్ పున్నం చందర్, ఏవో వినయ్ కుమార్, ఏఈఈ పిల్లలమర్రి ఏడుకొండలు, ఏఈవో కళ్యాణీ, కార్యదర్శి సురేందర్ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో ఒకరోజు పంటల ను పరిశీలించి నీటి తడుల పరిస్థితిని తెలుసుకునేందుకుగానూ పర్యటించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చింతకాని, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆత్మ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల గోవిందరావు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు రమేష్, శ్రీరాములు నాగేశ్వరరావు, మేకపోతుల శివ తదితరులు పాల్గొన్నారు.